క్లుప్తంగా

బీసీ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో బీసీ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు యుగేందర్‌నాయుడు అన్నారు. సంఘం కార్యవర్గ సమావేశం గురువారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించారు. బీసీ ఉద్యోగుల సంఘంలో మహిళకు ప్రాధాన్యత కల్పించేందుకు మహిళా విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు శాపంగా మారిన క్రిమిలేయర్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని కోరారు. మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా జీవిత, కో కన్వీనర్లుగా వెంకటలక్ష్మిని ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు నిత్యం ఉద్యోగుల సమస్యపై పోరాడానికి రాష్ట్ర కమిటీ సిద్ధంగా ఉందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న యుగేంధర్‌నాయుడును రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. కార్యక్రమంలో కృష్ణకుమార్, భిక్షపతి, శేఖర్, భార్గవ్, నర్సింహ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో సైనిక దినోత్సవం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం సైనిక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జేసీఓ జనరల్ సింగ్ విద్యార్థులతో తాను ఆర్మీలో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. ఆర్మీలో పనిచేసే వారు దేశభక్తి, క్రమశిక్షణ మెండుగా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఓ రాజేశ్వరి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమాలను అడ్డుకుంటాం



దేవరకద్ర: గతంలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిన అక్రమాలకు అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, నర్వశ్రీనివాస్‌రెడ్డి, రాంపాండు, భరత్, రామాంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్రషర్ నుంచి కంకరను పెద్ద ఎత్తున దేవరకద్రలో నిల్వ చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. జిల్లా మైనింగ్ అధికారులు కంకర సీజ్ చేశారని అయితే అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



కోయిల్‌కొండ: పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా కార్యదర్శులు పనిచేయాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. గురువారం మండలంలోని నల్లవల్లి, బూర్గుపల్లిలో ఆయన సందర్శించారు. ముందుగా గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా నర్సరీలలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. నర్సరీలను నాణ్యతతో నిర్వహించాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయాలలో రికార్డులను పరిశీలించారు. గ్రామాలలో ప్రజలు తీసుకవచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



జడ్చర్ల టౌన్: అయోధ్య విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి పేరు పెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండలంలోని మాచారంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి వాల్మీకులు పాలాభిషేకం చేశారు. చేశారు. బాలకృష్ణ, రాంచంద్రయ్య, తిరుపతయ్య, రవి ఉన్నారు.

బాలానగర్: బాలానగర్ మండలంలోని గంగధారిపల్లిలో బోయ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎంబీ బాలకృష్ణ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, శ్రీను, రాజు, నరేష్, స్వామి, సిద్ధు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చెదరని చిరునవ్వు

స్పెషల్ డ్రైవ్ ద్వారా బాలకార్మికులు, తప్పిపోయిన పిల్లల గుర్తింపు

- బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు మరో యత్నం
- సత్ఫలితాలనిస్తున్న ఆపరేషన్ స్మైల్



జిల్లాలో మూడేళ్లలో ఇలా..

సంవత్సరం	విముక్తి
2021	102
2022	78
2023	22
2024	16

(ఈనెల 17వ తేదీ వరకు)

మహబూబ్‌నగర్ రూరల్: నేటి బాలలే రేపటి పౌరులనే నినాదానికి సత్ఫలితాలు రావాలంటే ప్రతి తల్లితండ్రితో పాటు అందరూ తమ కర్తవ్యాలను పూర్తి చేయాలి. చిరు నవ్వులు చిందించాల్సిన బాల్యం వివిధ రకాల పనుల్లో మగ్గిపోతుండడం తీరని నష్టాన్ని మిగుల్చుతుంది. బాలకార్మికులు, తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారిని తల్లిదండ్రులకు అప్పజెప్పి వారికి మంచి జీవితాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుంది. ఇప్పటికే తొమ్మిది దఫాలుగా నిర్వహించింది. ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలను ఏటా నిర్వహిస్తుంది. ప్రస్తుతం ఆపరేషన్ స్మైల్-10 కొనసాగుతుంది.

మార్పు.. మార్గదర్శనం

ప్రతి సంవత్సరం జనవరి 1 నుంచి నిర్వహిస్తారు. ఇది పదోసారి. తప్పిపోయిన చిన్నారులను సొంత గూటికి చేర్చడం సహా బాలకార్మికులను ఆ వ్యవస్థ నుంచి విముక్తి కల్పించడమే ప్రధాన ధ్యేయం. చదువు మధ్యలో మానేసిన వారిని, యాచక వృత్తిలో కొనసాగుతున్న వారిలో మార్పు తెస్తారు. భవిష్యత్ మార్గదర్శనం చేస్తారు. వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీల్లో భాగస్వామలవుతున్నారు. ప్రధానంగా పోలీసు, బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ), కార్మిక, చైల్డ్ లైన్, విద్యా శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో జల్లెడ పడుతుంటారు. జిల్లాలో గతేడాది నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-9 ద్వారా 22 మంది బాలలను సంరక్షించారు. ఇందులో బాలురు 18, బాలికలు నలుగురు ఉన్నారు. వీరందరిని తల్లిదండ్రుల చెంతకు చేర్చి పాఠశాలల్లో చేర్పించారు. పిల్లలను పనిలో పెట్టుకున్న ఇద్దరు యజమానులపై కేసులు నమోదు చేశారు. ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జులై మాసంలో ముస్కాన్ చేపడుతున్నారు.

విభాగాల వారీగా చర్యలు

బాలకార్మికులకు సంబంధించి కేసులు నమోదు చేసే అంశాల్లో రెండు రకాల చట్టాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారు. 18 ఏళ్లలోపు బాలలు వారు పని ఆధారంగా సాధారణ, ప్రమాదకర కేటగిరీలుగా విభజించి కేసులు చేస్తారు. 14 ఏళ్ల లోపు చిన్నారులు అయితే బాండెడ్ లేబర్ చట్టం, 18 ఏళ్ల లోపు అయితే ప్రొబెషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ చట్టం ప్రకారం చర్యలు చేపడుతారు. తీవ్రత ఆధారంగా చర్యలు ఉంటాయి.

- అనాథ బాలలు అధికారుల కంటపడిన సందర్భంలో సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు ప్రైవేట్, ప్రభుత్వ వసతిగృహాల్లో చేర్పిస్తారు.
- బడీడు పిల్లలను బడిలో చేర్పిస్తారు. వారితో పనులు చేయించే సందర్భాల్లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అవసరం మేరకు ఆర్థిక సాయంగా ప్రతినెలా రూ. వెయ్యి అందిస్తారు. మౌలిక వసతులు కల్పిస్తారు.
- అదృశ్యమైన వారిని పట్టుకుని సంరక్షకుల చెంతకు చేర్చుతారు.
- యాచక వృత్తి చేసుకునే వారిని ప్రభుత్వ గృహాలు, స్వచ్ఛంద సంస్థల్లో చేర్పిస్తారు.
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే పిల్లలను హైదరాబాద్‌లోని పునరావాస కేంద్రాలకు తరలిస్తారు.
- బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు ఉంటాయి. కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు తల్లిదండ్రులతో హామీ పత్రం రాయించుకుంటారు. ఆసక్తి కలిగిన వారిని చదివిస్తారు.

పిల్లల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చర్యలు

బాల్యాన్ని ఆనందంగా గడిపేలా పెద్దలు పర్యవేక్షించాలి. పిల్లల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. బాలకార్మికులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. పిల్లలకు ఉజ్వల భవిత అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలాఖరు వరకు ఆపరేషన్ స్మైల్ కొనసాగనుంది.

– జ్యోతి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి

సమాచారం అందించాలి



తప్పిపోయిన, నిర్లక్ష్యానికి గురైన చిన్నారులు, యాచక బాలలు సహా బాల్య వివాహాలు, బాల కార్మికులు, వేధింపులు, హింసకు గురైనా, ఎలాంటి ఆపదలో ఉన్నా చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 లేదా డయల్ 100 సంప్రదించవచ్చు. ఎవరైనా గుర్తిస్తే సమాచారం అందించాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంటాయి.

– వెంకటమ్మ, కోఆర్డినేటర్, బాలరక్ష భవన్

కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించండి

జడ్చర్ల: మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని కోరుతూ గురువారం కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, సందకిశోర్‌గౌడ్, చౌహాన్, మహేష్ కమిషనర్ మహ్మద్ షేక్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా సమావేశాన్ని ఏర్పాటు చేసి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

పీహెచ్‌డీ పొందిన సురేష్‌కు సత్కారం

జడ్చర్ల టౌన్: తమిళనాడు తిరుచి (ప్రభుత్వ భారతి దాసన్ యూనివర్సిటీ తిరుచురాపల్లి) యూనివర్సిటీలో పీహెచ్‌డీ పట్టా పొందిన పట్టణ వాసి సురేష్‌ను గురువారం 24వ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో నర్సింహరావు, మహేశ్వర్, రాధాకృష్ణ, సత్యనారాయణ, విజయ్, వెంకటేష్, దామోదర్ పాల్గొన్నారు.

డా. సంధ్యకు వివేకానంద పురస్కారం

బాలానగర్: మండలంలోని హేమాజీపూర్ చెందిన డా.సంధ్య వివేకానంద పురస్కారానికి ఎంపికైనట్లు నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ బత్తుల హేమంత్ తెలిపారు. బీడీఎస్ డెంటల్ కోర్సు పూర్తి చేసి స్వయంగా ఆస్పత్రిని ఏర్పాటు చేసుకుని ఎంతో మందికి వైద్య సేవలు అందిస్తూ, స్ఫూర్తినిస్తున్నట్లు సంస్థ వారు పేర్కొన్నారు. శుక్రవారం అవార్డును అందించనున్నట్లు సంధ్య తెలిపారు.

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ రాక



చింతలపురి చిన్నయ్యస్వామి మఠం

నవాబుపేట: మండలంలోని కొల్లూర్‌లో జరుగుతున్న చింతలపురి మఠం ఆలయ ముఖద్వార ప్రారంభోత్సవానికి శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వస్తున్నట్లు ఆలయ పీఠాధిపతి నదీశ్వరస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం గ్రామంలో ముఖద్వారం ప్రారంభించిన అనంతరం వారు చెన్నసిద్ధరామ పండితుల సమక్షంలో జరుగుతున్న ధర్మజాగృతి సమావేశంలో పాల్గొంటారన్నారు. కాగా మఠంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు చిన్నయ్య మఠం రజతోత్సవ కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఇందులో భాగంగా శనివారం 60 ఏళ్లు నిండిన దంపతులకు షష్టి పూర్తి ఉత్సవం, ఆదివారం సామూహిక రుద్రయాగం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

చిన్నయ్యస్వామి జీవసమాధి

చింతలపురి చిన్నయ్యస్వామి 316 సంత్సరాల క్రితం కొల్లూర్ సమీపంలో తపస్సు చేసి శివానుగ్రహం పొంది అక్కడే జీవసమాధి అయినట్లు మఠం పీఠాధిపతి తెలిపారు. నాటి నుంచి చాలా మంది ఆయన శిష్యులు ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుని మఠం నిర్మించారన్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మఠానికి వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్, కొత్తపల్లి గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీస్‌ల దాడుల్లో పీడీఎస్ రైస్ పట్టుకున్నట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. పెద్దకడ్మూర్‌లోని నర్సింహ ఇంట్లో 3 క్వింటాళ్ల రేషన్‌బియ్యం, కొత్తపల్లి శివారులో ఆంజనేయులుకు చెందిన ఆటోలో 4.5 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టుకున్నామన్నారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మక్తల్: మండలంలోని సంగంబండలో గురువారం కోమటి నవీన్ ఇంట్లో 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వఉంచిన వీటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.



నర్వ పోలీసులు పట్టుకున్న పీడీఎస్ రైస్

పకడ్బందీగా నవోదయ ప్రవేశ పరీక్ష



బిజినేపల్లి: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 26 కేంద్రాల్లో నిర్వహించబోయే నవోదయ ప్రవేశ పరీక్షను సెంటర్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాలను కలెక్టర్లు, డీఈఓలు, ఇతర అధికారులు తనిఖీ చేస్తారని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రావు తెలిపారు. గురువారం బిజినేపల్లిలోని ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో 26 పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు, కేంద్ర పరిశీలనాధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 26 కేంద్రాల్లో పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం

అడ్డాకుల: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం ముగ్గురు లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా జానంపేట శివారులో నిర్మిస్తున్న ఓ పరిశ్రమ నిర్వాహకులు తమ భూములను అన్యాయంగా లాక్కుంటున్నారని కనకాపూర్ తండా గిరిజన రైతులు ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారితో వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఐకేపీ ఉద్యోగులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, శెట్టిశేఖర్, బగ్గి కృష్ణయ్య, నర్సింహారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నాగిరెడ్డి, తిరుపతయ్యగౌడ్, తాజోద్దీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

క్రీడా స్ఫూర్తితో లక్ష్యాలను పెంపొందించుకోవాలి



నాగినోనిపల్లిలో క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేస్తున్న మిథున్‌రెడ్డి

హన్వాడ: క్రీడా స్ఫూర్తితో లక్ష్యాలను పెంపొందించుకోవాలని బీజేపీ నాయకుడు ఏపీ మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని నాగినోనిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. టోర్నీలో ఫైనల్ మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, బుచ్చన్న, రఘురాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దొర్రితండాలో వికసిత్ భారత్..

మండలంలోని దొర్రితండాలో వికసిత్ భారత్ నిర్వహించారు. కార్యక్రమానికి మిథున్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపి చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా డ్రోన్ ద్వారా పంటలకు పిచికారి విధానాన్ని పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు.

అంతా ఎగుడు దిగుడే!



మిషన్‌భగీరథ పైపులైన్ వేసి సరిగా పూడ్చని మక్కామసీదు రోడ్డు

- టీడీగుట్టకు ఆనుకుని ఇళ్లు
- చిన్న గల్లీలు, పాత డ్రెయినేజీలే దిక్కు
- మక్కామసీదు రోడ్డు కి.మీ. మేర ధ్వంసం

32వ వార్డులో జనాభా: 5,996

ప్రధాన వీధులు: వీరన్నపేట (కొంత భాగం), మక్కా మసీదు ప్రాంతం (కొంత భాగం), పాపిరెడ్డి బంగ్లా, టీడీగుట్ట (కొంత భాగం), వడ్డెరగేరి.



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 32వ వార్డు పరిధిలోని ఇళ్లు దాదాపు టీడీగుట్టకు అటు, ఇటువైపు ఆనుకుని ఉండటంతో అంతా ఎగుడు దిగుడే. గుట్ట అంచు వరకు ఇళ్లు నిర్మించుకోవడంతో పై వరకు వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బైక్‌లు తప్పా ఆటోలు, కార్లు, జీపు ఇతర పెద్ద వాహనాలు లోపలి వరకు వెళ్లే పరిస్థితి లేదు. మక్కా మసీదు రోడ్డు వెంట మూడు నెలల క్రితం సుమారు కిలోమీటరు మేర మిషన్‌భగీరథ పథకం పైపులైన్‌ను నిర్మించారు. దీని కోసం బీటీని తొలగించి గుంతలను తవ్వినా సరిగా పూడ్చకపోవడంతో పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక చిన్న, చిన్న గల్లీలతో పాటు అన్నీ పాత డ్రెయినేజీలు కావడంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచి ముందుకు వెళ్లడం లేదని స్థానికులు వాపోతున్నారు. అన్నిచోట్ల సీసీ రోడ్లు నిర్మించినా ఊడ్చడానికి పారిశుద్ధ్య సిబ్బంది సరిగా రావడం లేదని చెబుతున్నారు. ఇక కోస్గి ప్రధాన రోడ్డు వెంట నిర్మించిన డ్రెయినేజీలో మురుగు పేరుకుపోయింది. అందులోనే కొందరు ప్లాస్టిక్, పాలిథీన్ కవర్లు పడేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో దుర్గంధం వెదజల్లుతోంది.



అధ్వానంగా మక్కామసీదు రోడ్డు



టీడీగుట్టలోని ఓ గల్లీలో ఇంకా మట్టి రోడ్డే గతి..

ఐరన్ పోల్ తొలగించాలి



మా ఇంటి ఎదుట ఉన్న ఐరన్ పోల్‌ను తొలగించి కొత్త సిమెంట్ స్తంభం ఏర్పాటు చేయాలి. వర్షాకాలంలో సపోర్టింగ్ వైరుతో పాటు ఇనుప స్తంభానికి షార్ట్ వస్తుంది. పొరపాటున ఎవరైనా తెలియకుండా దానిని పట్టుకుంటే ప్రమాదం పొంచి ఉంది. పండుగ సాయన్న గుడి గల్లీలోని మోరీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వస్తుంది. బయటకు రావాలంటేనే ముక్కు మూసుకోవాల్సిందే. పైపులైన్ కోసం తవ్విన మక్కామసీదు రోడ్డును బాగు చేయాలి.

– హమీద్, మక్కామసీదు రోడ్డు ప్రాంతం

సీసీరోడ్డు నిర్మించాలి



మా గల్లీలో నాలుగైదు ఏళ్ల క్రితం డ్రెయినేజీ మాత్రమే నిర్మించారు. సీసీ రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ ప్రాంతం అంతా గుట్ట ప్రదేశం కావడంతో నడవడానికి అవస్థలు పడుతున్నాం. పారిశుద్ధ్య కార్మికులు నెలకోసారి వచ్చి డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్నారు. కోస్గి ప్రధాన రోడ్డు వెంట ఉన్న డ్రెయినేజీలో మురుగు పేరుకుపోయినా తొలగించడం లేదు. వర్షాకాలంలో టీడీగుట్ట పై నుంచి వచ్చే వరద గల్లీల వెంట ప్రవహించడంతో బురదలో నుంచే వెళ్లాల్సి వస్తుంది.

– బాలయ్య, టీడీగుట్ట ప్రాంతం, కోస్గి రోడ్డు

రూ.1.50 కోట్లతో పనులు చేపట్టాం



నాలుగేళ్లలో రూ.1.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయించాం. ఇంకా రూ.50 లక్షలకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. 90 శాతం గుట్ట ప్రాంతం కావడంతో చివరి ఇళ్ల వరకు మెట్లతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయించాం. టీడీగుట్టలో ఇటీవల బస్తీ దవాఖానాను అందుబాటులోకి తెచ్చాం. మున్సిపల్ సాధారణ నిధులు రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాలు, రూ.పది లక్షలతో దర్గావద్ద మరో కమ్యూనిటీ హాలు నిర్మించాం. – సాదతుల్లా, కౌన్సిలర్, 32వ వార్డు

విద్యార్థికి డీఈఓ అభినందన



నవాబుపేట: మండలంలోని రుక్కంపల్లి ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీజా డీఈఓ రవీందర్ ఎదుట పాఠాలు బోధించి ఆశ్చర్యపరిచింది. గురువారం మండల పర్యటనకు వచ్చిన డీఈఓ రుక్కంపల్లి పాఠశాలను తనిఖీ చేస్తున్న తరుణంలో విద్యార్థులను ప్రశ్నించగా శ్రీజా లేచి పాఠాలు బోధించింది. బోధనను మెచ్చుకుని డీఈఓ విద్యార్థిని ప్రశంసించారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాలకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను నియమించారు. అడ్డాకులకు మండల కేంద్రానికి చెందిన మద్దూరి శరత్‌కుమార్‌రెడ్డిని, మూసాపేట మండలానికి నందిపేటకు చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డిలను నియమిస్తూ గురువారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి నియామక పత్రాలను అందజేశారు. తమకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

దేవరకద్ర: దేవరకద్ర మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిన్నరాజమూర్‌కు చెందిన ఎర్రగొల్ల గోవర్ధన్‌ను రెండోసారి నియమించారు. గురువారం రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తర్వులు అందజేశారు.

జిల్లా కార్యనిర్వాహక సభ్యుడిగా..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా ఆదివాసి కాంగ్రెస్ కార్యనిర్వాహక సభ్యుడిగా ఎర్రవల్లితండా (పిల్లలమర్రి)కు చెందిన గోవర్ధన్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్యనాయక్ నియామకపత్రం అందజేశారు. అనంతరం గోవర్ధన్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఊట్కూరు: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కోరారు. గురువారం మండలంలోని ఐఎఫ్‌టీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రథమ మహాసభలు ఉన్నాయని కార్మికులందరూ విధిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీ కార్మికులను రెగ్యూలర్‌చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని జీఓ నంబర్50ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాట్యూటీ తదితర వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మోటారు రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి భీమా సౌకర్యం కల్పించాలని కార్మికుల సహజ మరణానికి రూ. 5లక్షలు, ప్రమాద మరణానికి రూ. 10లక్షల బీమా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు హన్మంతు, రవీందర్, లింగప్ప, బాబు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఇథనాల్‌తో ఆహార కొరత

మరికల్: ఇథనాల్ పరిశ్రమలు స్థాపించిన గ్రామాల్లో భవిష్యత్‌లో ఏర్పడే కాలుష్యంతో ఆహార కొరత ప్రభావం ఉంటుందని కంపెనీ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ మురళీ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. చిత్తనూర్‌తోపాటు దిలావర్పూర్, హిందుపూర్ జిల్లాలో ఏర్పాటుచేస్తున్న ఇథనాల్ కంపెనీలను తరిమికొట్టేందుకు ఈ నెల 20న హైదరాబాద్‌లో సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. బాధిత గ్రామాల ప్రజలు, రైతులు, యువకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.